

నీలగిరిలో కుండపోత


కున్నూరు వద్ద కూలిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


ఊటీలో కురుస్తున్న వర్షం


గూడలూరు వద్ద వెల్లువలో కొట్టుకుపోతున్న కారు

- అవలాంజిలో 215 మి.మీ వర్షపాతం
- పర్యాటక ప్రాంతాల మూసివేత

అడయార్, మే 25 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రవేశంతో నీలగిరి జిల్లాలో కుంభవృష్టి కురిసింది. ఈ కారణంగా రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ రుతుపవనాల ప్రభావం కారణంగా అవలాంజిలో ఏకంగా 215 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ భారీ వర్షం కారణంగా జిల్లాలోని ఐదు పర్యాటక ప్రాంతాలను జిల్లా యంత్రాంగం మూసివేసింది. శనివారం రాత్రి నుంచి జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని శిగరం, అవలాంజి, పైన్ ఫారెస్ట్, షూటింగ్ మఠం, కున్నూర్ లేస్‌మార్క్ తదితర పర్యాటక ప్రాంతాలను మూసివేశారు. ఊటీ - గూడలూరు రోడ్డులో భారీ వృక్షాలు కూలడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో చలి తీవ్రత కూడా ఒక్కసారిగా పెరిగింది. జిల్లాలో ఆదివారం ఉదయం 7 గంటల వరకు అత్యధికంగా అవలాంజిలో 215 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గూడలూరు సమీపంలో ధర్మగిరిలో వరద నీటిలో అరుణ్ థామస్, ఆంద్రూ థామస్, రాజేష్ కొట్టుకుని పోతుండగా స్థానికులు గుర్తించారు.

కోవైకు సహాయక బృందాలు

ఈ వర్షాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా కోయంబత్తూరులో 48 మందితో కూడిన సహాయక బృందాలు చేరుకున్నాయి. తమిళనాడు ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థకు చెందిన సభ్యులు కోవై, నీలగిరి జిల్లాలకు 23, 25 మంది చొప్పున పంపించారు. వీరితో పాటు స్థానిక పోలీసులు, అగ్నిమాపకదళాలు కూడా మేట్టుపాళయంకు చేరుకున్నాయి. అలాగే, జిల్లా యంత్రాంగం కూడా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ లోతట్టు ప్రాంతాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లాలో అత్యవసర సహాయం, సేవల కోసం కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి హెల్ప్ ఫోన్ నంబర్లను కూడా ప్రకటించారు.


దొడ్డబెట్ట ప్రాంతం

గంగాధీశ్వరర్ ఆలయ రథం ట్రయల్ రన్


పురుషవాక్కం గంగాధీశ్వరర్ ఆలయ రథాన్ని లాగుతున్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం పురుషవాక్కం గంగాధీశ్వరర్ ఆలయంలో రూ.81లక్షలతో కొత్తగా రూపొందించిన రథం ట్రయల్ రన్ నేత్రపర్వంగా ఆదివారం ఉదయం కొనసాగింది. సుమారు ఎనిమిది శతాబ్దాల చరిత్ర కలిగిన గంగాధీశ్వరర్ ఆలయానికి 16 యేళ్ల తర్వాత రూ.4.82 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు ముగిసి గత యేడాది వైభవంగా కుంభాభిషేక వేడుకలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో రూ.81లక్షలతో కొత్త కొయ్య రథం, రూ.15.40లక్షలతో రథమండపం రూపొందించారు. ఆ కొయ్య రథం ట్రయల్ రన్‌ను రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియా తదితరులు పాల్గొన్నారు. స్థానిక భక్తులు రథం మోకుతాళ్ళను పట్టుకుని ఆలయ ప్రధాన వీధుల మీదుగా రథాన్ని లాగుతూ వెళ్ళారు.

రాష్ట్ర సంక్షేమం కోసమే ఢిల్లీ వెళ్లా

- సీఎం స్టాలిన్



చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): ఈడీ దాడులకు భయపడి తాను ఢిల్లీకి వెళ్ళలేదని, రాష్ట్ర సంక్షేమం కోసమే ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్నానని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పార్టీ శ్రేణులకు ఆదివారం ఓ సుదీర్ఘమైన లేఖ రాశారు. పన్నుల రూపంలో కేంద్రం వసూలు చేసే నిధులలో యాభైశాతం నిధులు రాష్ట్రాలకు కేటాయించాలని తాను విజ్ఞప్తి చేశానన్నారు. ఇన్నేళ్లుగా నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనని తాను ఉన్నట్టుండి ఆ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లడానికి టాస్మాక్ సంస్థపై జరుగుతున్న ఈడీ దాడుల వల్ల కలిగిన భయమేనని ప్రతి పక్ష నేత ఎడప్పాడి పళనిసామి సహా పలువులరు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంతో ఘర్షణ ధోరణికి స్వస్తిపలికి శాంతి ప్రయత్నంగా తెల్లజెండా పట్టుకుని ఢిల్లీ వెళ్లానని చెప్పడం వింతగా ఉందన్నారు. డీఎంకే ఎల్లప్పుడూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడే ఉంటుందన్నారు. మద్దతిచ్చినా, వ్యతిరేకించినా డీఎంకే సిద్ధాంతాలకు లోబడే వ్యవహరిస్తుందని ప్రధానిమంత్రిగా ఉన్న సమయంలో ఇందిరాగాంధీ ఎన్నో యేళ్లకు ముందే కుండబద్దలు కొట్టినట్లు ప్రకటించిన విషయాన్ని స్టాలిన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశ ఆర్థికాభివృద్ధిలో రాష్ట్రం ప్రధాన పాత్రను పోషిస్తోందని, ఆ కారణంగానే రాష్ట్ర ప్రతినిధిగా నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్నానని, అదే సమయంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులు గురించి, అమలు చేయాల్సిన పథకాలు గురించి సమావేశంలో ప్రధాని దృష్టికి తీసుకెళ్ళానని తెలిపారు. ప్రధానిని ప్రత్యేకంగా కలుసుకున్నప్పుడు కూడా రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన అంశాలపైనే ప్రస్తావించి వినతిపత్రం అందజేశానని చెప్పారు. ఈడీ దాడులకు భయపడి ఆగమేఘాలపై ఢిల్లీ వెళ్లి బీజేపీతో ఆకస్మిక పొత్తును కుదుర్చుకున్న ప్రతి పక్ష నేత ఎడప్పాడి పళనిసామి, టాస్మాక్ సంస్థను ఈడీ దాడుల నుంచి కాపాడుకునేందుకు ఢిల్లీ వెళ్లినట్లు తనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. టాస్మాక్ సంస్థలో ఈడీ దాడులు జరపడాన్ని సవాలు చేస్తూ తమ ప్రభుత్వం సుప్రీం కోర్టు దాకా వెళ్లి న్యాయపోరాటం సాగిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో ఈడీ, ఐటీ ఇతర దర్యాప్తు సంస్థలు దాడులు జరిపినా డీఎంకే భయపడే ప్రసక్తేలేదని, చట్ట ప్రకారం అన్ని దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనే సత్తా తమకుందని ఆ లేఖలో స్టాలిన్ పేర్కొన్నారు. బెదరింపులకు భయపడి పార్టీని కేంద్ర పాలకుల వద్ద తాకట్టుపెట్టే అలవాటు డీఎంకేకి ఎన్నడూ లేదని స్పష్టం చేశారు. వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో పార్టీని సమాయత్తపరిచే రీతిలో త్వరలో మదురైలో పార్టీ సర్వసభ్యమండలి సమావేశం జరపనున్నామని, ఆ సమావేశానికి పార్టీ శ్రేణులంతా పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

దూసుకొచ్చిన మృత్యు శకటం

- ఉసిలంపట్టి వద్ద అదుపుతప్పిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి


ప్రమాదంలో ధ్వంసమైన కారు

చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా ఉసిలంపట్టి సమీపం కుంజాంపట్టి వద్ద మెయిన్‌రోడ్డును దాటుతున్న ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురిపై అదుపుతప్పిన కారు దూసుకెళ్లిన దుర్ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడి ఆ స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కోవిల్‌పట్టిలో నివసిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన పాండి సెల్వి(28), లక్ష్మి(55), జ్యోతిక(20), ప్రహ్లాదన్(3), జయపాండి, కరుప్పాయి. కవియాళిని (1) ఉసిలంపట్టిలోని పెరుమాళ్ ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుని ఆదివారం వేకువజామున స్వస్థలానికి తిరిగి వెళ్తుండగా అదుపుతప్పి వేగంగా వచ్చిన కారు వారిపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పాండి సెల్వి, లక్ష్మి, జ్యోతిక, ప్రహ్లాదన్ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. జయపాండి, కరుప్పాయి, కవియాళిని తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన పూచ్చిపట్టికి చెందిన డ్రైవర్ ఆనంద్ ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

బూత్‌కమిటీల ఏర్పాటుకు సహకరించాల్సిందే

- ఈపీఎస్



చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): పార్టీలో ముఠా తగాదాలకు తావులేదని, వచ్చే యేడాది జరగనున్న శాసనసభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి జిల్లాలోనూ బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అయితే, కొన్ని జిల్లాల్లో ఆ కమిటీల ఏర్పాటుకు స్థానిక నాయకులు సహకరించడం లేదని తనకు ఫిర్యాదులు అందుతున్నాయని, తన ఆదేశాలకు వ్యతిరేకంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) హెచ్చరించారు. ఆదివారం ఉదయం ఆయన కోయంబత్తూరు విమానాశ్రయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ... కొన్ని జిల్లాల్లో బూత్‌కమిటీల ఏర్పాటు జాప్యంగా జరుగుతున్నట్లు తెలిసిందన్నారు. అలాంటి చోట్ల కూడా పార్టీ స్థానిక శాఖ నాయకులపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. పార్టీలో వర్గ విబేధాలకు తావులేదని, అందరూ ఐకమత్యంగా ఉంటేనే అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించగలమన్నారు.

స్టాలిన్ కపట నాటకం...

మూడేళ్లుగా నీతి ఆయోగ్ సమావేశాలను బహిష్కరించిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉన్నట్టుండి ఈ యేడాది ఆ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లడం ఆశ్చర్యంగా ఉందని ఈపీఎస్ అన్నారు. రాష్ట్రానికి కేంద్రం నిధులు ఇవ్వడం లేదంటూ ఆరోపిస్తూ ఆ సమావేశాలను బహిష్కరించిన స్టాలిన్ ఈసారి ఆ సమావేశంలో పాల్గొనటానికి టాస్మాక్ సంస్థపై జరుగుతున్న ఈడీ దాడులే కారణమని అందరికీ తెలుసునని చెప్పారు. స్టాలిన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రధాని మోదీకి నల్లజెండాను చూపారని, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఆయన తెల్లజెండా పట్టుకుని ఢిల్లీకి సయోధ్య కోసం వెళ్ళారని ఈపీఎస్ యెద్దేవా చేశారు.

సినీ సాహితీవనంలో నిండు పున్నమి వెన్నెలకంటి

- ఆచార్య విస్తాలి శంకరరావు


శంకరరావును సత్కరిస్తున్న జేకే రెడ్డి, మధు, కాట్రగడ్డ ప్రసాద్, సీఎంకే రెడ్డి

వేళచ్చేరి మే 25 (ఆంధ్రజ్యోతి): సినిమా సాహిత్యం అనేది అసలు సాహిత్యమే కాదనే స్థాయి నుంచి అది ఒక విలక్షణమైన సాహిత్యం అనే స్థాయికి చేర్చిన ఎందరో సినీ కవులు,రచయితలు చిరంజీవులుగా నిలిచారని అలాంటివారిలో వెన్నెలకంటి ఒకరని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు అన్నారు. వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 161వ ప్రసంగ కార్యక్రమంగా 'వెన్నెలకంటి సాహిత్యం - సినీ వెన్నెల జలపాతం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమం టి.నగర్ ఆంధ్రా క్లబ్ కృష్ణాహాలులో ఆదివారం సాయంత్రం ఏర్పాటైంది. వక్త విస్తాలి శంకరరావును సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు సత్కరించారు. అరుణా శ్రీనాథ్ ప్రార్థనాగీతం ఆలపించారు. సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి తన గంభీరమైన గ్రాతంలో కమ్మటి పద్యాలు పాడి సభికులను అలరింపజేశారు. వక్తను సభకు పరిచయం చేశారు. సభలో ఆస్కా ఎన్నికల్లో కొత్తగా ఎన్నికైన సభ్యులను కూడా సత్కరించారు. విస్తాలి శంకరరావు ప్రసంగిస్తూ ఒకవైపు సాహిత్యంలోను, మరోవైపు సినీ సాహిత్యంలోను, ఇంకోవైపు సినీ అనువాద సాహిత్యంలోను తనదైన శైలిలో ప్రత్యేక ముద్ర వేశారని, సినీ, టీవీ రంగుల ప్రపంచంలో నిండు పున్నమి వెలుగై నిలిచిన అగ్రశ్రేణి రచయిత వెన్నెలకంటి అని కొనియాడారు. వెన్నెలకంటి అంటే సినీ సాహిత్యానికి ఒక ఎన్‌సైక్లోపీడియా (ఒక విజ్ఞాన సర్వస్వం) అని, ఒక చమత్కారం, ఒక ఆత్మీయత, ఒక అనువాద విజ్ఞానమన్నారు. ముఖంలో ఎలాంటి కవలికలు లేకుండా తన చమత్కార పలుకులతో ఎదుటి వారిని గొల్లుమని నవ్వించడమే కాకుండా వారిని మరింత ఉడికించడం, అలాగే ఆత్మీయమైన స్పర్శతో హృదయంలో చెరగని ముద్రను వేసిన విలక్షణమైన వ్యక్తి అని అన్నారు. వెన్నెలకంటి 1957 నవంబర్ 30న శ్రీమతి వెన్నెలకంటి పద్మావతమ్మ, వెన్నెలకంటి కోటేశ్వరరావు దంపతులకు నెల్లూరులో జన్మించారు. వీరి జీవన నేపథ్యం, పరిసరాలు వీరిని విశిష్టత కలిగిన కవిలా ఎదిగేలా చేశాయి. ఆ లక్షణమే వారిని బ్యాంకు ఉద్యోగాన్ని వదలిపెట్టి సినిమా కవిగా మార్చేసిందన్నారు. సాహిత్యంలోను, వ్యాకరణంలోను, మహాభారత, రామాయణ, భాగవతాలల్లోను వివిధ భాషల విజ్ఞానంలోను మంచి పట్టు ఉండటంతో వెన్నెలకంటి అనతికాలంలోనే మేటి సినీ పాటల రచయితగా అగ్రస్థానంలో నిలిచారని అన్నారు. ఇక వారి కలం నుంచి చల్లని వెన్నెల జలపాతంలా జాలువారిన సాహిత్యానికి పాఠకులు, ప్రేక్షకలోకం ఆయనకు బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు. ఆయనను అనేక పురస్కారాలు వరించాయని, సాహితీ, సినీ సాహితీలోకంలో 'బహుముఖ ప్రజ్ఞాశాలి'గా, 'డబ్బింగ్ కింగ్'గా కీర్తిని గడించారని పేర్కొన్నారు. ఇక ఆయన సినీ సాహిత్యంలో ప్రదర్శించిన సాహితీ విన్యాసాలను అనేక పాటలు ద్వారా వివరిస్తూ, ఆ పాటల సృష్టిలోని దర్శకులు, నిర్మాతలు, సంగీత దర్శకులు, గాయనీ గాయకుల నేపథ్యాలను విపులంగా వివరించారు. వెన్నలకంటి రాజేశ్వర ప్రసాద్ అనే పేరు కలిగిన ఆయన 'వెన్నెలకంటి' అనే ఇంటిపేరుతో సుప్రసిద్ధులయ్యారని పేర్కొన్నారు.వెన్నెలకంటి 'శ్రీరామచంద్రుడు' సినిమాలో మొదటిసారిగా జోలపాట రాశారని చెప్పారు. శ్రీరంగరంగనాథుని దివ్యరూపమే చూడరే' అనే భక్తి గీతాన్ని కూడా అద్భుతంగా రచించారని తెలిపారు. దర్పణం, యత్రనార్యాస్తు పూజ్యంతే మొదలైన ఎన్నో సాహిత్య సంబంధిత రచనలు కూడా చేశారని పేర్కొన్నారు. ఆయన సాహిత్యంలో జోలపాటలు, భక్తిపాటలు, ప్రేమ గీతాలు, విషాద గీతాలు, సామాజిక చైతన్య గీతాలు, డబ్బింగ్ పాటలు పాడుతూ అందులోని దాగివున్న భావాలు, రచనా విశేషాలు, చమత్కారాలు తెలియజేయడమే కాకుండా తొలితరం, మలితరం సినీ కవులకు అనుసంధాన కర్తగా వ్యవహరించిన తీరును విశ్లేషించారు. తన సినీ ప్రస్థానంలో కుటుంబ సభ్యులతో పాటు ఎదిగేందుకు ఎందరో దోహదపడ్డారని, ముఖ్యంగా గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం ప్రోత్సాహం మరువలేనిదని తాను తినే ప్రతి బియ్యపు గింజపై ఎస్పీబీ పేరు ఉంటుందని వెన్నెలకంటి చెబుతుండేవారని తెలిపారు. అలాగే ఆయన స్నేహితులు గిరీశం, సుబ్బారావు సహకారం ఎంతో ఉందని వ్యక్తంచేశారు. వెన్నెలకంటి పేరులోవున్న 'వెన్నెల'ని సాహిత్యంలో నింపి జలపాతంలా పరుగులు తీయించిన సాహితీ ఘనుడు అని అభినందించారు.


సభలో ప్రసంగిస్తున్న విస్తాలి శంకరరావు

అసెంబ్లీ ఎన్నికల పనులు ప్రారంభించండి

యువజన విభాగానికి ఉదయనిధి పిలుపు

చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల పనులను వెనువెంటనే ప్రారంభించాలని డీఎంకే యువజన విభాగ నేతలు, పార్టీ శ్రేణులకు ఆ విభాగం అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో పార్టీ యువజన విభాగం కీలక పాత్రను పోషించనున్నదని, ద్రావిడ తరహా డీఎంకే పాలనలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు గురించి నియోజకవర్గాల వారీగా ప్రచారం చేయాల్సిన బాధ్యత ఈ విభాగానిదేనని చెప్పారు. తిరుచ్చి నగరంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన డీఎంకే యువజన విభాగం సమావేశంలో ఆయన ప్రసంగించారు. యువజన విభాగం కార్యకర్తలంతా ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలు పంచి ముమ్మరంగా ప్రచారం సాగించాలన్నారు. డీఎంకే మళ్లీ అధికారంలో వస్తుందనే నమ్మకం ఉందని, అయితే ఈసారి 200 సీట్లలో గెలిచి తీరాలని పార్టీ అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారన్నారు. ఆ దిశగానే యువజన విభాగం కార్యకర్తలు ఇప్పటి నుంచే అసెంబ్లీ ఎన్నికల పనులు ప్రారంభించాలన్నారు.

చెన్నై చేరుకున్న పవన్ కల్యాణ్

చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో వన్ నేషన్ - వన్ ఎలక్షన్‌పై ఈనెల 26న సోమవారం నిర్వహించే సెమినార్‌లో పాల్గొనడానికి ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదివారం రాత్రి చెన్నై చేరుకున్నారు. ఆయనకు తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ సాదరంగా స్వాగతం పలికారు. సీనియర్ రాజకీయ నాయకుడు, పర్యావరణ ఉద్యమకారుడు కె.ఎస్.రాధాకృష్ణన్, రాష్ట్ర బీజేపీ నాయకులు ఎం.చక్రవర్తి, అర్జునమూర్తి, అమర్‌ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పవన్ రాక సమాచారం అందుకున్న జనసేన శ్రేణులు పార్టీ జెండాలతో విమానాశ్రాయానికి చేరుకుని స్వాగతం పలికారు. పవన్ బస చేయనున్న హోటల్ దగ్గర బీజేపీ రాష్ట్ర చీఫ్ నయినార్ నాగ్రేందన్ సహా పలువురు బీజేపీ నేతలు స్వాగతం పలికారు. సోమవారం ఉదయం తిరువాన్మియూరులోని రామచంద్ర కన్వెన్షన్ హాలులో జరగనున్న 'ఒకే దేశం - ఒకే ఎన్నిక సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.


పవన్‌కు స్వాగతం పలుకుతున్న తమిళిసై తదితరులు

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా కుమరన్‌చావిడి పరిధిలోని అంబాళ్‌నగర్, పూందమల్లి బైపాస్ రోడ్డు, పారివాక్కం, బానవీడు గార్డెన్, పిడారి తాంగల్, కొలపన్‌చేరి ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రభుత్వాస్పత్రుల్లో ఎల్‌ఈడీ బల్బులు, ఫ్యాన్లు

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): కేంద్య విద్యుత్ శాఖకు చెందిన 'బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ' సంస్థ దేశవ్యాప్తంగా విద్యుత్ పొదుపుగా వినియోగించుకోవాలని సూచిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ట్యూబ్ లైట్ సహా పలు విద్యుత్ సాధనాలు వినియోగిస్తున్నారు. దీర్ఘకాలంగా ఈ సాధనాలు వినియోగిస్తుండడంతో నాణ్యత తగ్గి, విద్యుత్ వినియోగం అధికమవుతోంది. అందువల్ల, కేంద్రప్రభుత్వ నిధులతో, తక్కువ విద్యుత్ వినియోగంతో అధిక సామర్థ్యంతో పనిచేసే ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందుకోసం ప్రభుత్వాస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పరిశీలించి, మార్చాల్సి విద్యుత్ సాధనాల వివరాల నివేదికను ఈ నెల 31వ తేదిలోపు పంపించాలని జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్లకు విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది.

గృహాలకు వేగవంతమైన ఇంటర్ నెట్ సేవలు

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కోటి గృహాలకు వేగవంతమైన ఇంటర్‌నెట్ సేవలు అందించే పథకం వచ్చే నెల ప్రారంభం కానుందని సమాచారం. గృహాలకు తక్కువగా రూ.199 ధరకు 20 ఎంబీపీఎస్ వేగంతో ఇంటర్‌నెట్ సేవలు అందించనున్నారు. ప్రజలు తమ వినియోగానికి అనుకూలంగా రూ.399, రూ.499 ప్యాకేజీలు కూడా అందుబాటులోకి రానున్నాయి. అలాగే, వాణిజ్య సంస్థలకు రూ.899, రూ.1,199 అనే రెండు ప్యాకేజీలు అందించనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి 13 వరకు దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై ప్రభుత్వ వృత్తి శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2025వ సంవత్సర అడ్మిషన్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ సంస్థ సివిల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, డ్రాఫ్ట్‌మన్ మెకానికల్, ప్లంబర్, వెల్డర్, ఇంటీరియర్ డిజైనర్ వంటి విభాగాల్లో శిక్షణ అందిస్తుంది. శిక్షణలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు www.skilltraining.tn.gov.in-లోకానీ ఉత్తర చెన్నై ప్రభుత్వ వృత్తి శిక్షణ సంస్థ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు నెం.9499055653, 8144622567లలో సంప్రదించవచ్చు.

యోగా ఉచిత తరగతులు

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): సత్యానంద యోగా కేంద్రం పరిధిలోని సన్యాసి కృష్ణ యోగా కేంద్రం ఆధ్వర్యంలో యోగా ఉచిత తరగతులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా, వేళచ్చేరి తిరువీధి అమ్మన్ ఆలయ వీధిలో ఈనెల 30వ తేది, నంగనల్లూర్ లక్ష్మీ నగర్ మెయిన్ రోడ్డులో ఉన్న సుదర్శన్ టెర్రస్ హాలు ఈనెల 31వ తేది నుంచి ప్రారంభం కానున్న తరగతులు నాలుగు వారాలు నిర్వహించనున్నారు. ఈ తరగతులు ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు నిర్వహించనున్నారు. వివరాలకు నెం.9445051015లో సంప్రదించవచ్చు.

346 రోడ్ల మరమ్మతులకు రూ.92 కోట్లు

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గుంతల్లో నీరు చేరి వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రారంభం కావడంతో, కార్పొరేషన్ ముందు జాగ్రత్త చర్యలు ముమ్మరం చేసింది. అందులో భాగంగా కార్పొరేషన్ పరిధిలో 14 మండలాల్లో 346 రోడ్లను రూ.92.74 లక్షలతో పునరుద్ధరించేందుకు టెండర్లు ఆహ్వానిస్తోంది. ఈ నెలాఖరులోపు టెండర్లు ఖరారుచేసి వచ్చే నెల మొదటి వారం నుంచి పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

29న రవాణా కార్మికుల వేతన ఒప్పందంపై చర్చలు

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): రవాణా కార్మికుల కొత్త వేతన ఒప్పందం చర్చలు ఈ నెల 29వ తేది జరగనున్నాయి. రాష్ట్ర రవాణా శాఖలో 1.43 లక్షల మంది కార్మికులు పనిచేస్తుండగా, వారికి మూడేళ్లకు ఒకసారి వేతనాలు పెంచుతుంటారు. 14వ వేతన ఒప్పందం ముగిసి, ఏడాది పైగా అవుతున్నా, ఇంకా వేతన పెంపుపై ఒప్పందం జరగలేదు. అందుకోసం మూడో విడత చర్చలు క్రోంపేటలో ఈనెల 29న జరుగనున్నాయి. ఈ చర్చల్లో పాల్గొనాలని 80 కార్మిక సంఘాలకు లేఖ రాసినట్లు అధికారులు చెప్పారు. వేతన ఒప్పందం, పదవీ విరమణ ప్రయోజనాలు, ప్రభుత్వ సేవలకు మారడంపై చర్చించనున్నారు.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు వస్తున్న నీటి రాక తగ్గింది. కావేరి నది పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మేట్టూరు డ్యాంకు శనివారం 5,725 ఘనపుటడుగులుగా వస్తున్న నీరు, ఆదివారం 2,878 ఘనపుటడుగులకు తగ్గింది. డ్యాం నుంచి తాగునీటి అవసరాలకు 1,000 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 111.60 అడుగులు (పూర్తి సామర్థ్యం 120 అడుగులు) చొప్పున 80.70 టీఎంసీల నీటి నిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. కాగా, డెల్టా సాగు కోసం జూన్ 12వ తేది మేట్టూరు డ్యాం నుంచి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నీరు విడుదల చేయనున్నారు.

ప్రభుత్వ ప్రధాన ఖాజీ కన్నుమూత

● సీఎం స్టాలిన్ సహా నేతల సంతాపం



ప్రభుత్వ ప్రధాన ఖాజీ సలావుద్దీన్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, ఎంపీ టీఆర్‌బాలు, మంత్రి పీకే శేఖర్‌బాబు తదితరులు



సలావుద్దీన్ మహమ్మద్ అయూబ్ (ఫైల్ ఫొటో)

చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన ఖాజీ సలా ఉద్దీన్ మహమ్మద్ అయూబ్ శనివారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయస్సు 84 సంవత్సరాలు. వృద్ధాప్య సమస్యలకు తోడు గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ వచ్చారు. అరబ్బీలో, సాహిత్యంలో ఏంఏ., ఎంఫిల్., పీహెచ్‌డీ పట్టాలు పొందారు. ఖాజీగా పదవీ బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన కాలేజీ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఖాజీ సలా ఉద్దీన్ మహమ్మద్ ఆయూబ్ మృతికి ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తదితరులు ఖాజీ మృతి సంతాపం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ జారీ చేసిన ప్రకటనలో ఖాజీ సలా ఉద్దీన్ మహమ్మద్ ఆయూబ్ సాహెబ్ కన్నుమూశారనే వార్త విని దిగ్భ్రాంతికి గురైనట్లు పేర్కొన్నారు. ముస్లింలపై ఆయన చూపిన ప్రేమాదరణలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆరోగ్యం సహకరించినంత వరకూ తాను రంజాన్ ఇఫ్తార్‌లో పాల్గొంటానని తరచూ తనతో చెబుతుండేవారని తెలిపారు. అత్యంత సౌమ్యుడైన ఖాజీ మృతి ముస్లిం సోదరులకే కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ తీరని లోటని స్టాలిన్ పేర్కొన్నారు.ఖాజీ మృతితో శోకతప్తులైనవారి కుటుంబీకులకు, ఆత్మీయులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

అసెంబ్లీకి పోటీ చేసి గెలిచే సత్తా ఉందా?

● తమిళిసైకి మంత్రి శేఖర్‌బాబు సవాల్

అడయార్, మే 25 (ఆంధ్రజ్యోతి): మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ మహిళా నేత డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌కు రాష్ట్ర దేవాదాయ మంత్రి పీకే శేఖర్‌బాబు సవాల్ విసిరారు. అసెంబ్లీకి పోటీ చేసి గెలుపొందే సత్తా తమిళిసైకు ఉందా అని సూటిగా ప్రశ్నించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... తమిళిసై సౌందర్‌రాజన్ గురించి మాట్లాడి సమయం వృథా చేసుకోవడం ఇష్టంలేదన్నారు. ఏదో ఒకటి మాట్లాడి ఆ పార్టీలో గుర్తింపు తెచ్చుకోవాలన్నదే ఆమె తాపత్రయం అన్నారు. అలాంటి తమిళిసైకు తాను ఒక బహిరంగ సవాల్ విసుతున్నానని, చెన్నైలో ఏదో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచే సత్తా ఆమెకు ఉందా అని ప్రశ్నించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆమెను చిత్తుగా ఓడించిన పార్టీ డీఎంకే అని అన్నారు. 2026లో జరిగే శాసనసభ ఎన్నికల్లో ఆమె మళ్లీ పోటీ చేస్తారనే వార్తలు వస్తున్నాయని, ఒక వేళ అదే జరిగే ఏం జరుగుతుందో చూపిస్తామన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 10 కాలేజీలు ఉన్నాయన్నారు. మైలాపూర్ కపాలేశ్వర కాలేజీలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థుల్లో 241 మందికి ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. తిరుచ్చెందూరు ఆలయ కుంభాభిషేకం జూలై 7న జరుగుతుందన్నారు. తిరుత్తణి ఆలయంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మరుదమలై, స్వామిమలైలో లిఫ్ట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ముమ్మరంగా టి.నగర్ ఫ్లైఓవర్ నిర్మాణం



పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ముమ్మురంగా సాగుతున్నాయి. ప్రముఖ వ్యాపార కేంద్రం టి.నగర్‌లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేలా టి.నగర్ ఉస్మాన్ రోడ్డు నుంచి అన్నాసాలై వరకు కొత్త ఫ్లై ఓవర్ నిర్మాణాలు 2023లో ప్రారంభమయ్యాయి. స్టీల్, కాంక్రీటు మిశ్రమాన్ని ఉపయోగించి 'కంపోజిట్ గిర్డర్' పద్ధతిలో రూ.131 కోట్లతో ఈ స్టీల్ ఫ్లై ఓవర్ చేపట్టారు. టి.నగర్‌లోని దురైస్వామి రోడ్డు - ఉస్మాన్ రోడ్డు జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ దక్షిణ వైపున స్టార్టింగ్ బేస్‌ను జీఆర్‌టీ జ్యువెలర్స్ సమీపంలో కూల్చివేసి, అక్కడి నుంచి సౌత్ ఉస్మాన్ రోడ్డు మీదుగా అన్నాసాలై జంక్షన్ వరకు 1.2 కి.మీ దూరం ఫ్లై ఓవర్ నిర్మిస్తున్నారు. గత ఏడాది దీపావళికి ఫ్లై ఓవర్ ప్రారంభించాల్సి ఉండగా, పలు కారణాలతో నిర్మాణాల్లో జాప్యం చోటుచేసుకుంది. ప్రస్తుతం ఫ్లై ఓవర్ నిర్మాణం 85 శాతం ముగియగా, మిగిలిన పనులు మరో నెల రోజుల్లో పూర్తిచేయాలని నిర్ణయించినట్లు కార్పొరేషన్ ఫ్లై ఓవర్ల శాఖ అధికారులు తెలిపారు.

తండ్రిని కోల్పోయిన విషాదంలోనూ... పరీక్షల్లో ఉత్తీర్ణులైన బాలికలకు సత్కారం



విద్యార్థినులు సత్యప్రియ, శాలినిని సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి

చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లాలో ప్లస్-2, ప్లస్-1 పబ్లిక్ పరీక్షల సమయంలో తండ్రిని కోల్పోయి, తీవ్ర విషాదంలోనూ ఆ పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన ఇద్దరు బాలికలను ఆదివారం సాయంత్రం డిప్యూటీ ముఖ్యమంత్రి ఉదయనిధి సత్కరించారు. ఇరువురినీ శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. తిరుచ్చి జిల్లా, కరుంగుళం ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ప్లస్-2 చదువుతున్న సత్యప్రియ తండ్రి మార్చి 10న గుండెపోటుతో మృతి చెందారు. మరుసటి రోజు సత్యప్రియ తండ్రి మృతి వల్ల కలిగిన విషాదాన్ని భరిస్తూ ఆ పరీక్షకు హాజరైంది. ఇటీవల వెలువడిన ఆ పరీక్షా ఫలితాల్లో ఆమె 528 మార్కులతో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. ఇదే విధంగా తేనేరిపట్టి ప్రభుత్వ పాఠశాలలో ప్లస్-1 పబ్లిక్ పరీక్షలు రాస్తున్న శాలిని తండ్రి గుండెపోటుతో మార్చి 12న మృతి చెందారు. మరుసటి రోజు విషాదంతో శాలిని కంప్యూటర్ సైన్స్ పరీక్ష రాసింది. ఆ పరీక్షలో 79 మార్కులు సాధించింది. అన్ని పాఠ్యాంశాలలో మొత్తం 367 మార్కులు పొంది ఉత్తీర్ణురాలైంది.. పుదుకోట, తిరుచ్చి, కరూరు జిల్లాల్లో ఏర్పాటైన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన డిప్యూటీ ముఖ్యమంత్రి ఉదయనిధి తిరుచ్చిలో ఆదివారం సాయంత్రం ఆ బాలికలను ఘనంగా సత్కరించారు. మంత్రులు కేఎన్ నెహ్రూ, కొవి చెళియన్, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, జిల్లా కలెక్టర్ ఎం. ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో బీజేపీ నేతలు, కార్యకర్తలు

తిరుత్తణి, మే 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టులో 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ పళ్లిపట్టు నార్త్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన 'త్రివర్ణ పతాక' ర్యాలీని స్థానిక చిత్తూర్ రోడ్డు వద్ద మాజీ సైనికుడు జయరామ్ ప్రారంభించారు. బీజేపీ తిరువళ్లూర్ పశ్చిమ జిల్లా కార్యదర్శి మణికంఠన్, ఉపాధ్యక్షుడు సూరి, కార్యదర్శి భాస్కర్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. పళ్లిపట్టు నార్త్ యూనియన్ అధ్యక్షుడు ఎ.కిరణ్‌కుమార్, నాయకులు హరిప్రసాద్, హేమలత, గోవిందస్వామి, డిల్లీ, రోహిత్ సహా పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి

తిరుత్తణి, మే 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టులో జమాబందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బజార్ వీధిలో నివసిస్తున్న 180 కుటుంబాల వారు తమకు పట్టాలు అందించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ అంశం పరిశీలించి తగిన చర్యలు చేపడతామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బజార్ వీధి వాసులు

భారీ వర్షానికి కూలిన సెల్ టవర్



సెల్‌టవర్ కూలిన ప్రాంతం వద్ద గుమికూడిన స్థానికులు

చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా ఇరాణియల్ ప్రాంతంలో గత రెండు రోజులుగా పెనుగాలులలో కురిసిన భారీ వర్షానికి సెల్‌టవర్ కూలింది. అంగన్‌వాడీ ఉద్యోగి రాజమల్లి ఇంటి సమీపంలో గత కొద్ది నెలలుగా ఓ సెల్‌ఫోన్ టవర్ నిరుపయోగంగా ఉంటోంది. దీనితో శనివారం పెనుగాలులతో కురిసిన వర్షానికి ఆ టవర్ కూలి రాజమల్లి ఇంటిపై పడింది. దీంతో ఆ ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. ఈ సమాచారం తెలుసుకుని తహసీల్దార్ జాన్ హనీ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. పోలీసులు, అగ్నిమాపక దళం సభ్యులు కూలిన సెల్‌టవర్ తొలగింపు పనులు చేపట్టారు.

ఎడ్యుకేషన్ టూర్‌కు 22 మంది విద్యార్థులు

అడయార్, మే 25 (ఆంధ్రజ్యోతి): 'నాన్ ముదల్వాన్' పథకం కింద ఎడ్యుకేషన్ టూర్ కోసం 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరంతా జర్మనీకి బయలుదేరివెళ్లారు. ఈ విద్యార్థులు వారం రోజుల పాటు జర్మనీలో పర్యటిస్తారు. 2023-24 విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అన్ని పోటీల్లో మొదటి స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి, 'నాన్ ముదల్వాన్' అనే పథకం కింద వివిధ దేశాలకు తీసుకెళుతుంటారు. గత రెండేళ్లుగా ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ విజయవంతంగా సాగుతోంది. ఇందులోభాగంగా, 2024-25 విద్యాసంవత్సరానికిగాను 22 మంది విద్యార్థులను ఎంపిక చేసి జర్మనీకి తీసుకెళ్లారు.

దోష నివృత్తి పరిహార పూజలకు పోటెత్తిన భక్తులు

అడయార్, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరువణ్ణామలైలో అరుణచలేశ్వర స్వామి ఆలయంలో అగ్నినక్షత్ర కాలం ముగియనున్న తరుణంలో దోష నివృత్తి పరిహార పూజలను ఆదివారం నిర్వహించారు. ఈ పూజల్లో పాల్గొందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్రంలో అగ్ని నక్షత్రం ఈనెల 4 తేదీన ప్రారంభమై 28వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో అరుణాచలేశ్వర ఆలయంలో 4వ తేదీ నుంచి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తారాభిషేక పూజలు నిర్వహిస్తున్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు కూడా చేశారు. అయితే, అగ్నిక్షత్ర కాలం ముగియనున్న తరుణంలో దోష నివృత్తి పరిహార పూజలను ఆదివారం నిర్వహించారు. ఈ పూజలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి.

38 అడుగుల రాక్షస కత్తి తయారీ

అడయార్, మే 25 (ఆంధ్రజ్యోతి): శివగంగై జిల్లా తిరుభువనంలో 38 అడుగుల పొడవు రాక్షస కత్తిని తయారు చేశారు. దీన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ జిల్లాల్లో 250కు పైగా కత్తుల తయారీ కొలిములు ఉన్నాయి. ఇక్కడ తయారయ్యే కత్తుల్లో తిరుప్పాచ్చికి ప్రత్యేక ఉంది. ఈ జిల్లావాసుల ఇష్టదైవాలైన కరుప్పన్న స్వామి, సోనైస్వామిలకు ఆలయాలు కూడా ఉన్నాయి. ఈ ఆలయాలకు కత్తులను భక్తులు కానుకలుగా సమర్పిస్తుంటారు. ఆర్థికంగా స్తోమత కలిగినవారు మూడు నుంచి 21 అడుగల పొడవుతో ఉండే కత్తులను కానుకలుగా సమర్పిస్తుంటారు. అయితే. ఇపుడు సింగపూర్‌లో నివసించే పట్టుక్కోటకు చెందిన ఒక భక్తుడు ఇచ్చిన ఆర్డరు మేరకు 35 అడుగుల కత్తిని తయారు చేశారు.

వెల్లయంగిరి కొండపై ఇద్దరు భక్తుల మృతి

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): వెల్లయంగిరి కొండ ఆలయానికి వెళ్లిన మహిళ సహా ఇద్దరు భక్తులు మృతి చెందారు. కోవై జిల్లా వెల్లయంగిరి కొండల్లోని స్వయంభు శివలింగం వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వెళ్తుంటారు. ఈ ప్రాంతానికి చేరుకోవాలంటే ఏడు కొండలు అధిరోహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, ఈ ప్రాంతానికి వెళ్లిన కారైక్కాల్‌కు చెందిన కౌసల్య(45) ఏడో కొండ అధిరోహిస్తుండగా, శ్వాస తీసుకోవడం కష్టమై స్పృహ తప్పి మృతి చెందింది. అలాగే, 5వ కొండపై తిరువణ్ణామలై జిల్లాకు చెందిన సెందిల్‌కుమార్ మృతిచెందాడు. మృతదేహాలను అటవీ శాఖ సిబ్బంది కిందకి చేర్చారు. ఈ ఏడాది వెల్లయంగిరికి వెళ్లిన ఏడుగురు భక్తులు మృతి చెందారు. కాగా, కోవై జిల్లాకు భారీ వర్ష సూచన ప్రకటించడంతో, తదుపరి ప్రకటన వెలువడే వరకు వెల్లయంగిరి వెళ్లేందుకు భక్తులకు నిషేధించినట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది.

గంజాయి, మత్తు మాత్రల తరలింపు

● మైనర్ సహా ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత వాషర్‌మెన్‌పేటలో గంజాయి, మత్తు మాత్రలు తరలిస్తున్న మైనర్ సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం ఉదయం తండయార్‌పేట ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో పోలీసులు పాత వాషర్‌మెన్‌పేట సునామీ క్వార్టర్స్ వెనుక భాగంలో గస్తీ పనులు చేపట్టారు.ఆ సమయంలో ఆ ప్రాంతంలో సంచరిస్తున్న 17 ఏళ్ల బాలుడు సహా ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. బాసుదేవ్ వీధికి చెందిన గౌతం, కిషోర్ నుంచి 25 నొప్పి నివారణ మాత్రలు, 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.ఈవ్యవహారంలో పోలీసులు అదుపులోకి తీసుకున్న మైనర్‌పై ఇప్పటికే ఒక కేసు ఉంది.

శివకాశి బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు



పేలుడు కారణంగా ధ్వంసమైన గది

చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శివకాశి సమీపం అమ్మాపట్టిలోని బాణసంచా తయారీ కర్మాగారంలో ఆదివారం వేకువజామున జరిగిన భారీ పేలుడులో రసాయన పదార్థాలు భద్రపరచిన గది నేలమట్టమైంది. ఆదివారం ఆ కర్మాగారంలో పనిచేసే కార్మికులకు సెలవుదినంగా ఉండటంతో ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళం సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ఈ పేలుడు కారణంగా చుట్టుపక్కల ఉన్న ఇళ్లు భూకంపం వచ్చినట్లు కదలటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. శివకాశి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

తిరువళ్లూరు వద్ద రైలు కిందపడి తండ్రీకుమార్తె ఆత్మహత్య



లోకనాథన్, జశ్వంతిక (ఫైల్ ఫొటోలు)

చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ తండ్రి తన కుమార్తెతోపాటు తిరువళ్లూరు - పుట్లూరు మధ్య వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తిరువళ్లూరు సమీపం ఈక్కాడు టీచర్స్ కాలనీలో లోకనాథన్ (38), వాణి దంపతులు నివసిస్తున్నారు. వీరికి జశ్వంతిక(6) అనే కుమార్తె ఉంది. లోకనాథన్ తిరువళ్లూరు - కాకలూరు బైపాస్‌రోడ్డులో భవన నిర్మాణ వస్తువులమ్మే దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్ కూడా చేసేవాడు. ఇటీవల ఆన్‌లైన్ ట్రేడింగ్ వల్ల సుమారు రూ.15లక్షల దాకా నష్టపోయాడు. దీంతో అప్పు ఇచ్చినవారంతా ఇంటిచుట్టూ తిరుగుతూ ఒత్తిడి చేశారు. ఈ నేపథ్యంలో లోక్‌నాథన్, తన కుమార్తె జశ్వంతికను వెంటబెట్టుకుని బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఆ ఇరువురి ఆచూకీ కోసం అన్ని చోట్లా వెదికి వేసారిన వాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపడుతుండగా శనివారం అర్ధరాత్రి తిరువళ్లూరు - పుట్లూరు రైల్వేస్టేషన్‌ల నడుమ రైలు పట్టాల పక్కన రెండు మృతదేహాలు తునాతునకలై పడిఉండగా కనుగొన్నారు. రైల్వే పోలీసులు ఆ మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వందేభారత్ ఢీకొని పూల వ్యాపారి మృతి

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి సమీపంలో వందేభారత్ రైలు ఢీకొని పూల వ్యాపారి మృతి చెందాడు. ఆవడి గౌరిపేటకు చెందిన సూర్యనారాయణన్ (45) పూల వ్యాపారి. శనివారం రాత్రి వ్యాపారం ముగించుకుని చేక్కాడు సబ్‌వే సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా, కోయంబత్తూర్ నుంచి చెన్నైకు వస్తున్న వందేభారత్ ఢీకొంది. ఈ ఘటనలో సూర్యనారాయణన్ తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఆవడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాలు తాగుతూ ఊపిరాడక పసికందు మృతి

పెరంబూర్, 25 (ఆంధ్రజ్యోతి): అమ్మ వద్ద పాలు తాగుతూ ఊపిరాడక పసికందు మృతిచెందింది. మదురై జిల్లా ఇరుంబాడి సమీపం బాలకృష్ణాపురానికి చెందిన కార్తికేయన్, స్వాతి (21) దంపతులకు జన్మించిన ఆడశిశువు 45 రోజుల్లోనే మృతి చెందింది. ఈ క్రమంలో, 11 రోజుల క్రితం స్వాతి మగబిడ్డకు జన్మనిచ్చింది. యధావిధిగా స్వాతి బిడ్డకు పాలు ఇస్తున్న సమయంలో, హఠాత్తుగా ఊపిరాడక బిడ్డ స్పృహతప్పింది. దీంతో, తల్లిదండ్రులు హుటాహుటిన చోళవందాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే బిడ్డ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న చోళవందాన్ పోలీసులు, పసికందు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

28న లైంగిక వేధింపుల కేసు తీర్పు

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన లైంగిక వేధింపుల కేసులో ఈనెల 28న చెన్నై మహిళా న్యాయస్థానం తీర్పు వెలువరించనుంది. గత ఏడాది డిసెంబరు 23వ తేది రాత్రి 8 గంటలకు స్థానిక గిండిలోని అన్నా వర్శిటీ ప్రాంగణంలో 19 ఏళ్ల విద్యార్థినిపై లైంగిక వేధింపులు జరిగాయి. ఈ వ్యవహారంలో చెన్నై కోట్టూరుపురం మహిళా పోలీసులు, అదే ప్రాంతానికి చెందిన డీఎంకే నాయకుడు జ్ఞానశేఖరన్‌ను అరెస్ట్ చేశారు. ఘటన జరిగిన సమయంలో జ్ఞానశేఖర్ ఒక వ్యక్తితో ఫోన్‌లో 'సార్' అని సంబోధించి మాట్లాడినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ కేసులో మద్రాసు హైకోర్టు ఉత్తర్వులతో ముగ్గురు మహిళా ఐపీఎస్ అధికారులతో కూడిన ప్రత్యేక బృందం విచారించి ఛార్జిషీటు దాఖలుచేసింది. ఈ కేసు విచారణ అల్లికుళం వాణిజ్య సముదాయంలో పనిచేస్తున్న మహిళా కోర్టులో విచారణ సాగుతోంది. వాదనలు పూర్తైన నేపథ్యంలో, ఈ కేసులో ఈ నెల 28న మహిళా కోర్టు తీర్పు వెలువరించనుంది.

షాపింగ్ మాల్ నుంచి దూకి యువకుడి ఆత్మహత్య

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమింజికరైలోని ఓ షాపింగ్ మాల్ 3వ అంతస్తు నుంచి దూకి యువకుడు ఆత్మహ్యకు పాల్పడ్డాడు. సైదాపేటకు చెందిన ఇంద్రజిత్ సింగ్ (33) ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. శుక్రవారం అమింజికరైలోని ఓ షాపింగ్ మాల్‌కు వెళ్లిన ఇంద్రజిత్, మూడో అంతస్తులోని ఓ దుకాణానికి చెందిన వస్తువులు కొనుగోలు చేశాడు. వస్తువులు బిల్ చెల్లించేందుకు వేచి ఉన్న ఇంద్రజిత్, హఠాత్తుగా షూ తీసేసి, పరుగెత్తుకుంటూ వెళ్లి మూడవ అంతస్తు నుంచి కిందకు దూకాడు. తలకు రక్తగాయాలతో ఉన్న అతన్ని చుట్టుపక్కల వారు కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై అమింజికరై పోలీసులు కేసు నమోదుచేశారు. ఇంద్రజిత్‌కు వివాహమై మూడేళ్లు దాటినా పిల్లలు పుట్టకపోవడంతో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడా? మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు.

కలెక్టరేట్‌లో తుపాకీతో కాల్చుకుని మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



కానిస్టేబుల్ అభినయ (ఫైల్ ఫొటో)

చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా కలెక్టర్ కార్యాలయం సబ్‌ట్రెజరరీ వద్ద ఆదివారం ఉదయం తుపాకీతో కాల్చుకుని మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. మైలాడుదురై జిల్లా మనక్కుడి సమీపం కీళిరుప్పు ప్రాంతానికి చెందిన అభినయ(29) నాగపట్టినం జిల్లా సాయుధదళంలో మహిళా కానిస్టేబుల్. ఈమె భర్తతో గొడవపడి విడాకులు పొంది కొంతకాలంగా వేరుగా ఉంటోంది. నాగపట్టినం సాయుధదళం పోలీసుల క్వార్టర్స్‌లో ఓ ప్లాట్‌లో నివసిస్తోంది. నాగపట్టినం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న జిల్లా సబ్‌ట్రెజరరీ వద్ద విధులు నిర్వహిస్తోంది. రొటేషన్ పద్ధతిలో ఆమె ఈ డ్యూటీ చేస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి సబ్‌ట్రెజరరీ వద్ద అభినయ, మరో మహిళా కానిస్టేబుల్ డ్యూటీ చేశారు. ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో అభినయ తన వద్దనున్న తుపాకీతో కాల్చుకుంది. శబ్దం విని పరుగెత్తుకొచ్చిన మరో మహిళా కానిస్టేబుల్ నేలపై రక్తపు మడుగులో పడి ఉన్న అభినయను చూసి దిగ్భ్రాంతి చెందింది. ఉన్నతాధికారులకు ఫోన్ చేసింది. సాయుధ దళం డీఎస్పీ నాగూర్ తదితర పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని విచారణ జరిపారు. అభినయ మృతదేహాన్ని నాగపట్టినం వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. నాగపట్టినం ఎస్పీ అరుణ్ కపిలన్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది, అభినయతోపాటు నైట్ డ్యూటీ చేసిన మహిళా కానిస్టేబుల్‌ను విచారించారు.

అపార్ట్‌మెంట్‌లో కూలిన మెట్లు

● ముగ్గురికి గాయాలు

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ మెట్లు కూలిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. నొచ్చికుప్పంలో మూడు అంతస్తుల అపార్ట్‌మెంట్‌లో పలు కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ఆదివారం ఉదయం అపార్ట్‌మెంట్ మెట్లు హఠాత్తుగా కూలాయి. దీంతో, పై అంతస్తుల్లో పలువురు చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వారిని సురక్షితంగా కిందకు దించారు. ఈ ఘటనలో 15 ఏళ్ల బాలిక సహా ముగ్గురు గాయపడగా, వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.


'పరందు పో'లో మిర్చి శివ

విడుదలకు సిద్ధమైన 'పరందు పో'

మిర్చి శివ, అంజలి, గ్రేసీ ఆంటోని, అజు వర్గీస్ తదితరులు నటించిన తాజా చిత్రం 'పరందు పో'. 'కాట్రు తమిళ్', 'తంగ మీన్‌గల్', 'పేరన్బు', 'తరమణి' వంటి చిత్రాలను రూపొందించిన రామ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సంతోష్ దయానిధి సంగీతం అందించగా, యువన్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు.ఈ చిత్రం జూన్ 4న విడుదలకానుంది. చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా తొలి సింగిల్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రామ్ మాట్లాడుతూ... 'విడుదల చేసిన ఫస్ట్ సింగిల్‌ను అందమైన లొకేషన్లలో చిత్రీకరించాం. పొద్దు తిరుగు పువ్వు (సన్‌ఫ్లవర్)ను నేపథ్యంగా తీసుకున్నాం. నాకు కూడా పొద్దుతిరుగు పువ్వంటే చాలా ఇష్టం. నా మొదటి సినిమా కోసం అందమైన సూర్యోదయంపై పొద్దుతిరుగు తోటలో చిత్రీకరించే అద్భుతమైన అవకాశం లభించింది. పొద్దుతిరుగుడు పువ్వులు వికసించే సమయం, ఆ పుష్పం నేపథ్యం తెలుసుకునేందుకు 'పరందు పో' సినిమాను చూసేందుకు రండి. ఈ చిత్రం కథం కూడా ప్రతి ఒక్కరి మనసును హత్తుకునేలా ఉంటుంది' అని పేర్కొన్నారు.

కథ బాగుంటే భాష అడ్డంకి కాదు

● క్వీన్సీ స్టాన్లీ




కథ బాగుంటే భాష అడ్డంకి కాదని వర్ధమాన నటి క్వీన్సీ స్టాన్లీ అభిప్రాయపడ్డారు. జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అయిన క్వీన్సీ.. మోడల్‌గా, నటిగా, రియాలిటీ షో సెలెబ్రిటీగా రాణించారు. భారతీయ చిత్రపరిశ్రమలో అత్యంత ఆశాజనకమైన యువ హీరోయిన్లలో ఒకరు. తన ప్రయాణంపై ఆమె మాట్లాడుతూ... 'నేను బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా జర్నీని ప్రారంభించా. ఆ తర్వాత మోడలింగ్, సృజనాత్మక రంగంలోకి అడుగుపెట్టా. అదే నన్ను నటన వైపు నడిపించేలా చేసింది. మ్యూజిక్ వీడియోలు, టెలివిజన్ సీరియళ్లలో నటించిన తర్వాత రియాలిటీ షో బిగ్ బాస్‌లో అవకాశం లభించింది. సీరియళ్లలో నటించడం వల్ల క్రమశిక్షణతో కెమెరా అనుభవం లభించింది. అయితే, సినిమాల్లో నటించడం వేరు. కథ చెప్పే విధానం కొత్తగా ఉంటుంది. 'ఓం కాళి జై కాళి' వెబ్ సిరీస్‌లో నా పాత్ర అభిమానుల ప్రశంసలు అందుకుంది. ఇది నా మనసుకు చాలా దగ్గరగా ఉంది. సూర్య, ఫహద్ ఫాజిల్ వంటి నటులంటే అమితమైన ఇష్టం. మణిరత్నం, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సంజయ్ లీలా బన్సాలీ దర్శకత్వంలో పనిచేయాలని ఉంది. వీరు తీసే చిత్రాల్లో మహిళా పాత్రలకు ప్రాధాన్యం ఉంటుంది. హిందీ, తమిళం, తెలుగు, ఇంగ్లీష్ భాషలు తెలుసు. మరికొన్ని కొత్త భాషలను నేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నా. కథ బాగుంటే భాష అడ్డంకే కాదు. కథ డిమాండ్ మేరకు గ్లామర్ పాత్రలను పోషించేందుకు సిద్ధం' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి


బాక్సాఫీస్ నెంబర్ల కోసం

సినిమా తీయలేను

● మణిరత్నం



బాక్సాఫీస్ నెంబర్ల కోసం సినిమాలు తీయడం తనకు ఏమాత్రం నచ్చదని ప్రముఖ దర్శకుడు మణిరత్నం అన్నా రు. కమల్ హాసన్ హీరోగా నటించిన కొత్త చిత్రం 'థగ్‌లైఫ్'. మణిరత్నం దర్శకుడు. శింబు, శివరాజ్‌కుమార్, త్రిష, అభిరామి, అశోక్ సెల్వన్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. ఈ సినిమా ఆడియో రిలీజ్ వేడుక శనివారం రాత్రి చెన్నైలోని ఓ ప్రైవేటు కాలేజీ ఆడిటోరియంలో జరిగింది. ఇందులో మణిరత్నం మాట్లాడుతూ.. 'భారీ కలెక్షన్లు రాబట్టే సినిమాలు చేయడం ముఖ్యమా? లేదంటే ప్రేక్షకుల మదికి చెరువయ్యే సినిమాలు చేయడం ముఖ్యమా? అని ఒక్కసారి ఆలోచించండి. ఇపుడు సినిమాను ఒక వ్యాపార కోణంలో చూస్తున్నారు. రానున్న రోజుల్లో సినిమా నాణ్యతను దెబ్బతీసే విధంగా మారకూడదని ఆశిస్తున్నా' అని అన్నారు. హీరో శింబు మాట్లాడుతూ.. 'నా సినీ కెరీర్‌లో ఎన్నో కష్టాలు, సవాళ్ళు ఎదుర్కొన్నా. కష్టకాలంలో నా తల్లిదండ్రులు అండగా నిలిచారు. నాలో ధైర్యాన్ని నింపారు. నటుడిగా నాలో స్ఫూర్తి నింపిన వ్యక్తి కమల్ హాసన్. ఆయన సినిమాలు చూసి పెరిగా. నాకే కాదు. ఎంతోమందికి ఆయన స్ఫూర్తి. కమల్‌ను రీప్లేస్ చేసే నటుడు వచ్చాడంటూ చాలామంది నన్ను ఉద్దేశించి అన్నారు. నిజం చెప్పాలంటే ఆయన్ను ఎవరూ రీప్లేస్ చేయలేరు. నా దృష్టిలో ఆయనొక గొప్ప నాయకుడు. నాకు వ్యతిరేకంగా రెడ్‌కార్డ్ జారీ చేశారంటూ వార్తలు వచ్చిన సమయంలో నిర్మాతలెవ్వరూ నాతో సినిమాలు చేసేందుకు ముందుకురానపుడు నన్ను నమ్మి నాతో సినిమా చేసేందుకు ముందుకు వచ్చిన వ్యక్తి దర్శకుడు మణిరత్నం. ఆయన ఎప్పటికీ నా గురువు. గాడ్ ఫాదర్. చిన్నతనం నుంచి సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్‌ను ఇబ్బంది పెడుతూనే ఉన్నాను. నేను కష్టకాలంలో ఉన్నపుడు ఆయన తన ప్రయాణాలన్నీ రద్దు చేసుకుని నా సినిమా కోసం వర్క్ చేయడానికి నిలబడ్డారు. ఇప్పటివరకు నేను 150 పాటలు పాడా. నాకు తొలి అవకాశం ఇచ్చిన వ్యక్తి రెహ్మాన్' అని పేర్కొన్నారు.


శిలంబరసన్

మేకల చోరీ నేపథ్యంలో 'మైయల్'

జహన్ సినీ క్రియేషన్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై ఏపీజీ ఏళుమలై దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మైయల్'. మైనా సేతు, సమృద్ధి తార, పీఎల్ తేనప్పన్, సూపర్ గుడ్ సుబ్రమణి, రాధికా కాలా, ఆర్‌పీ బాలా తదితరులు నటించారు. సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ... 'గ్రామీణ నేపథ్యంలో మేకల చోరీతో సాగే కథాంశం, సొంత చిన్నాన్న ఆస్తిపై కన్నేసిన ఓ వ్యక్తి తన మనుషులతో ఆయన్ను హత్య చేయించడం మరో కథాంశం. ఈ రెండు కేసులను విచారించే ఓ పోలీస్ ఆఫీసర్‌గా ఆర్‌పీ బాలా నటించారు. ఈ మూడింటిని బ్యాలెన్స్ చేస్తూ, ప్రేక్షకులకు అమితాసక్తి కలిగించేలా తెరకెక్కించాం. ఈ మూవీ ద్వారా 90 దశకంలో ఓ వెలుగు వెలిగిన సంగీత దర్శకుడు సౌందరరాజన్ తనయుడు అమర్ గీత్ ఈ మూవీ ద్వారా సంగీత దర్శకుడుగా పరిచయమయ్యారు. పాటలతో పాటు నేపథ్య సంగీత సినిమాకు అదనపు బలం. మేకలను చోరీ చేసేందుకు వచ్చిన వ్యక్తితో హీరోయిన్ ప్రేమ, ఘర్షణ తదితర అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కించాం' అని వివరించారు.


'మైయల్'లో ఓ దృశ్యం



తిరుచెందూరుకు పోటెత్తిన భక్తులు

తిరుచెందూరు ఆలయం వద్ద దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 24న శనివారం రాత్రి నుంచే రాష్ట్రం నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం వేకువజాము అక్కడి సముద్రతీరం వద్ద, నాళికినరు వద్ద భక్తుల రద్దీ గంటగంటకూ అధికమైంది. జూలైలో మహాకుంభాభిషేకం జరగనుండటంతో జీర్ణోద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఓ వైపు వేసవి, వారాంతపు సెలవులతో ఆలయానికి విచ్చేసిన భక్తుల రద్దీ అధికమవుతూ వచ్చింది. భక్తులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించేందుకు తరలివచ్చారు. భక్తుల రద్దీ పెరగడంతో స్వామివారిని దర్శించేందుకు నాలుగు గంటలపాటు క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. ఆదివారం వేకువజాము 4 గంటలకే ఆలయాన్ని తెరచి, 4.30 గంటలకు విశ్వ రూప దర్శనం, ఉదయం 6 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం హాలులలోనూ ఉదయం 11 గంటల నుంచే భక్తులు రద్దీ అధికమైంది.

నాగాలాండ్ గవర్నర్‌కు జన్మదిన శుభాకాంక్షలు


ఇల.గణేశన్‌తో వీఐటీ వర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం దంపతులు, పారిశ్రామికవేత్త నల్లి కుప్పుస్వామి చెట్టి

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): నాగాలాండ్ రాష్ట్ర గవర్నర్ ఇల.గణేశన్ ఇటీవల 80వ జన్మదినం జరుపుకున్నారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో వీఐటీ యూనివర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం, అనూష సెల్వం దంపతులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త నల్లి కుప్పుస్వామి చెట్టి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్, బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొని, గణేశన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తరం రాయడంపై శిక్షణ


శిబిరంలో పాల్గొన్న వారితో నిర్వాహకులు

పెరంబూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): 'మెడ్రాస్ పోస్ట్ క్రాసింగ్ కమ్యూన్', 'పోస్టల్ హట్' సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మైలాపూర్ నాగేశ్వరరావు పార్కులో ఉత్తరాలు రాయడంపై శిక్షణ శిబిరం ఆదివారం జరిగింది. శిబిరంలో తపాలా పరిచయం, పోస్ట్‌కార్డులపై ఉత్తరాలు రాయడం, పోస్టల్ స్టాంపుల ప్రత్యేకతలు, ప్రత్యేక ఎన్వలప్, కళాత్మక పోస్ట్‌కార్డుల తయారీ తదితర అంశాలు వివరించగా, 6 నుంచి 80 సంవత్సరాల వయసు కలిగిన వారు పాల్గొన్నారు. ఈ విషయమై మెడ్రాస్ పోస్ట్ క్రాసింగ్ కమ్యూన్ ఆర్గనైజర్ జయశక్తివేల్ మాట్లాడుతూ.. ఉత్తరాలు రాసేందుకు ఆసక్తి ఉన్న వారిని సమీకరించి, 2019లో ఈ సంస్థ ప్రారంభించామన్నారు. ప్రతినెలా పార్కులు, మైదానాలు సహా పలు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఉత్తరాలు రాయడం, తపాలా స్టాంపుల సేకరణలో ఆసక్తి ఉన్న వారు నెం.9841366086లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

అలరించిన అమృత విద్యార్థుల ఫ్యాషనిస్టా


ఫ్యాషన్ షోలో పాల్గొన్న విద్యార్థులతో అనిత సంపత్

అడయార్, మే 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అమృత ఏవియేషన్ కాలేజీకి చెందిన విద్యార్థులు ఫ్యాషనిస్టా పేరుతో ప్రత్యేక ఫ్యాష్ షోను నిర్వహించారు. క్యాబిన్ క్రూ దుస్తులు ధరించి ఈ ప్రదర్శనలో వారు పాల్గొన్నారు. మీడియా, టెలివిజన్ ప్రెజెంటర్ సెలబ్రిటీ అనిత్ సంపత్, ఫ్యాషన్ షో నిపుణులు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత సంపత్ మాట్లాడుతూ... ఎయిర్‌పోర్టు చెక్ ఇన్ కౌంటర్, మోడల్ ఎయిర్‌క్రాఫ్ట్, మోడల్ ఎయిర్‌పోర్టు వంటి అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆచరణాత్మక విద్యను అందిస్తున్న చెన్నై అమృత ఏవియేషన్ విద్యా సంస్థను ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాత ఇందులో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి బహుమతులు ప్రదానం చేశారు.


పాంబన్ కాలువ


ఇసుకమేటలో కూరుకుని ఆగిన నౌక

పాంబన్ మరమ్మతులు...

ఐదు దశాబ్దాల నిరీక్షణ ఫలించేనా?

● 'సాగర్‌మాల పథకం' అమలయ్యేనా

టి.నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపంలోని పాంబన్ కాలువ మరమ్మతుల కోసం స్థానికులు, జాలర్లు, మరపడవల యజమానులు, వివిధ ప్రాంతాల నుంచి పాంబన్ కాలువ మీదుగా వెళ్లే ఓడలు, నౌకల యాజమాన్య సంస్థల నిర్వాహకులు ఐదు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. పాంబన్ ఓడరేవు దేశంలోనే అత్యంత ప్రాచీనమైన చరిత్రాత్మక ప్రాశస్త్యం కలిగిన రేవుల్లో ఒకటి. 1480లో సంభవించిన పెను తుఫాను కారణంగా మన్నార్, పాక్ జలసంధుల మధ్య సహజసిద్ధంగా ఈ పాంబన్ కాలువ ఏర్పడింది. ఈ పాంబన్ కాలువ పాంబన్, మండపం ప్రాంతాలను వేరు చేయటంతో రామేశ్వరం ప్రత్యేక దీవిగా ఆవిర్భవించింది. పాంబన్‌కాలువ మార్గం పాంబన్ సమీపంలోని కుందుక్కల్, కురుజడై దీవికి చెందిన రెండు సముద్ర సరిహద్దుల మధ్య నీటి ప్రాంతం నుంచి ప్రారంభమై, దాదాపు రెండు కిలోమీటర్ల దాకా విస్తరించి, పాంబన్ రహదారి వంతెన, రైల్వే వంతెన ప్రాంతాలను దాటి వెళ్తుంది. ఈ కాలువ వెడల్పు 125 మీటర్లు, లోతు 2.11 మీటర్లు. ఆంగ్లేయుల పాలనలో 1854లో 4400 అడుగుల పొడవైన పాంబన్ కాలువను మొదటిసారిగా తవ్వారు. తర్వాత 1964లో ధనుష్కోడి తుఫాను సహా వివిధ రకాల తుఫాన్ల కారణంగా ఇసుకతో కప్పబడి కాలువ లోతు 2 మీటర్లకు తగ్గింది. కొన్ని సమయాలలో నౌకలు, మర పడవలు ఒండ్రుమట్టిలా బురదలతో నిండిన పాంబన్ కాలువను దాటడానికి ఇబ్బంది పడుతుంటాయి. చాలా సార్లు ఓడలు, పడవలు చిక్కుకుని ఆగిపోయిన సందర్భాలున్నాయి. ఈ ఇబ్బందులన్నీ తొలగి సాఫీగా ఓడలు, పడవలు ప్రయాణించాలంటే ఆ కాలువలో పూడిక తీసి, దాని లోతును పదిమీటర్ల దాకా పెంచాల్సిన అవసరం ఉంది. ఈ పూడిక తీత పనులు జరపాలని ఆ మార్గంలో మరపడవలు, ఫైబర్‌బోట్లు నడిపే జాలర్లు, నౌకలు నడిపే సంస్థల నిర్వాహకులు కేంద్ర ప్రభుత్వానికి ఐదు దశాబ్దాలుగా విజ్ఞప్తి చేస్తున్నారు. కాలువ లోతును పెంచితే నౌకా వాణిజ్యం అధికమవుతుందని చెబుతున్నారు.


కూరుకుపోయిన నౌకలో సిబ్బంది

టూరిస్ట్ పాయింట్‌గా పాంబన్ రైలు వంతెన..

ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా మండపం, రామేశ్వరం ప్రాంతాలను కలిపేలా వందేళ్లనాటి ప్రాచీన పాత పాంబన్ రైలు వంతెనకు సమాంతరంగా రూ. 531 కోట్లతో నిర్మించిన కొత్త పాంబన్ రైలు మార్గం ప్రాంతం ప్రస్తుతం ప్రఖ్యాత పర్యాటక ప్రాంతంగా మారింది. 2.07 కి.మీల పొడవు కలిగిన ఈ రైలు వంతెనను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన విషయం విదితమే. ఈ కొత్త రైలు మార్గం వంతెనను నిర్మించక ముందు రామేశ్వరం తీర్థయాత్రకు, రామనాథపురం నగరాన్ని సందర్శించేందుకు వెళ్లేవారంతా వీలునుబట్టి పాంబన్ రహదారి (రోడ్డు) ఫ్లైఓవర్ ప్రాంతానికి వెళ్లి పావుగంట అక్కడ వేచి ఉండి పాత రైలు వంతెనను ఆసక్తిగా తిలకించేవారు. ప్రస్తుతం ఆ పాత వంతెనకు తోడుగా కొత్త రైలు వంతెన కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో ఆ రెండు రైలు వంతెనల అందాలను తిలకించడానికి రోజూ వేలసంఖ్యలో పర్యాటకులు, రామనాథస్వామివారి ఆలయాన్ని దర్శించే భక్తులు పోటీపడుతున్నారు. రామేశ్వరం నుంచి రామనాథపురం వైపు, అలాగే రామనాథపురం నుంచి రామేశ్వరం వైపు వెళ్లే యాత్రికులు, పర్యాటకులు తమ వాహనాలను పాంబన్ రహదారి వంతెనపై కాసేపు నిలిపి, కొత్త పాంబన్ వంతెన అందాలను సెల్ఫీలు తీసుకుంటున్నారు. ప్రైవేటు బస్సులు, ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులలో వెళ్లే ప్రయాణికులు కూడా పాంబన్ వంతెన సమీపిస్తుండగానే పది నిమిషాలపాటు బండిని ఆపమని కోరుతున్నారు. ప్రస్తుతం పాంబన్ రహదారికి ఇరువైపులా 24 గంటలపాటు గస్తీ వాహనంలో ప్రత్యేకదళం తీవ్ర నిఘా వేస్తున్నారు. పర్యాటకులు, భక్తులు, పాంబన్ రైలు వంతెనను తిలకించేందుకు పది నిమిషాలవరకు అనుమతిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో పాంబన్ రైలు వంతెనను తిలకించే సందర్శకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో పాంబన్ ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం తలకు మించిన భారంగా మారిందని వాపోతున్నారు.


పాంబన్ రైలు వంతెన సమీపంలో సెల్ఫీలు తీసుకుంటున్న పర్యాటకులు

ఇసుక మేటలో కూరుకుపోయిన ఓడ...

ఇదిలా ఉండగా విశాఖపట్నం నుంచి బయలుదేరి పాంబన్ పాక్ జలసంధి ప్రాంతంలో వేచి ఉండిన ఫార్ట్ ఓడ గత ఏప్రిల్ 20న కర్ణాటక రాష్ట్రం కార్వార్ వెళ్లడానికి పాంబన్ రైలు వంతెన ప్రాంతాన్ని దాటుకుని వెళుతూ కుందుక్కాల్ సమీపంలో ఇసుకమేటలో కూరుకుపోయింది. ఆ నౌకలో కేప్టెన్ సహా 10మందికిపై సిబ్బంది ఉన్నారు. తూత్తుకుడి నుండి తెప్పించిన టగ్‌బోట్ ద్వారా ఆ నౌకను ఇసుకమేట నుంచి జలాల్లోకి తరలించారు. ఈ విషయమై రాష్ట్ర చిన్న ఓడరేవుల శాఖ ఉన్నతాధికారులు మాట్లాడుతూ... ఈ కాలువను 10 మీటర్ల లోతు పూడికతీస్తే 30 టన్నుల బరువు కలిగిన షిప్‌లు శ్రీలంక దీవిని చుట్టుకుని వెళ్లాల్సిన అవసరం ఉండదని, పాంబన్‌కాలువను దాటి వెళితే ప్రయాణ దూరం తగ్గి త్వరగా గమ్యస్థానాలను చేరుకోవచ్చని చెప్పారు. పాంబన్ కాలువ పూడిక తీత పనులకు సంబంధించి ఐఐటీ నిపుణుల బృందం ఈ కాలువ అడుగుభాగాన ఉన్న మట్టి నమూనాలను సేకరించి పరిశోధనలు కూడా జరిపిందని, ప్రస్తుతం 'సాగర్‌మాల పథకం' కింద ఈ కాలువ పూడిక తీసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే పనులు త్వరగా పూర్తవుతాయన్నారు.

నేను చేసిన తప్పేంటి డాడీ!

● నెల రోజులు కంటిపై కునుకు లేదు
● మానసిక క్షోభ అనుభవిస్తున్నా
● పీఎంకే నేత అన్బుమణి రాందాస్

చెన్నై, మే 25 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసమే అహర్నిశలు పాటుపడ్డా.. నేనేం తప్పు చేశానో నాకే తెలియడం లేదు.. నెల రోజులుగా నిద్ర లేదు, మానసిక క్షోభను అనుభవిస్తున్నా... అంటూ పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి రాందాస్ తనను పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ పార్టీ పదవి నుంచి తొలగించిన సంఘటనపై ఓ బహిరంగసభలో వందలాది మంది కార్యకర్తల ఎదుట తన విషాదాన్నంతా ఏకరువుపెట్టారు. ధర్మపురి జిల్లా కడత్తూరులో వన్నియార్ సంఘం, పీఎంకే సీనియర్ నేత కణల్ రామలింగం చిత్రపటావిష్కరణ సభ ఏర్పాటైంది. పీఎంకే గౌరవాధ్యక్షుడు జీకే మణి, శాసనసభ్యులు వెంకటేశ్వరన్, సదాశివం, మాజీ శాసనసభ్యుడు వేలుసామి, పీఎంకే జిల్లా శాఖ కార్యదర్శి అరసాంగం తదితర నాయకులు ఈ సభలో పాల్గొన్నారు. సభలో అన్బుమణి రాందాస్ ఉద్వేగంగా మాట్లాడుతూ... 2026లో జరిగే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావాలి, పీఎంకే కూటమి అధికారంలోకి వచ్చేలా వ్యూహరచన చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వన్నియార్ల సంఘం అభివృద్ధి చెందాలని, అందుకోసమే పీఎంకే ఆవిర్భవించిందని, ఇటీవల మహాబలిపురం సమీపంలో చిత్రాపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన వన్నియార్ల సంఘం యువజన మహానాడు విజయవంతం కావడం చూసి పలు పార్టీలు ఓర్వలేక ఉన్నాయని తెలిపారు. కులగణన జరపాలని సుప్రీం కోర్టు ఆదేశించి 1150 రోజులు దాటిందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. రెండు నెలల వ్యవధిలోనే కులగణను పూర్తి చేయవచ్చని, అయితే రాష్ట్ర పాలకులు ఆ దిశగా పనులు ప్రారంభించలేకున్నారన్నారు. గత నెల రోజులుగా మానసిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నానని, కంటిపై కునుకు రావడం లేదని, తానేం తప్పుచేశానో తెలియటమే లేదన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ చెప్పిందే వేదంగా అమలు చేసేవాడినని అన్బుమణి వాపోయారు. ఇకపై కూడా రాందాస్ ఆదేశాలనే తూ..చా.. తప్పకుండా పాటిస్తానని చెప్పారు. వన్నియార్లకు న్యాయం జరగాలనే తామంత తీవ్రంగా పాటుపడతామన్నారు. భవిష్యత్తులోనూ సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానని అన్బుమణి శపథం చేశారు. వచ్చే యేడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలో వస్తే వన్నియార్లు దశాబ్దాల తరబడి కోరుకుంటున్న రిజర్వేషన్లు అమలు కాగలవన్నారు. భవిష్యత్తులో ఐకమత్యంగా ఉంటూ విజయం కోసం పోరాడాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.


సభలో ప్రసంగిస్తున్న డాక్టర్ అన్బుమణి రాందాస్